
# ఎఱ్ఱ త్రికోణం

*

కె.కె.మీనన్



అది పట్నంకాదు. అలాగని అదిపల్లెటూరు మాత్రంకాదు. పెద్ద పల్లెలాంటి చిన్న పట్నం. అయినా దానికోచరిత్ర వుంది.

అధికారంలోవున్న అమాత్యులవారు ఆవూళ్లోనే అవతరించారు. వారికి ఓట్లిచ్చి అధికారం హస్తగతం చేసిన అధికసంఖ్యాకులైన ఆకలి మనుషులున్నారు. వాళ్ళని నిత్యం దోచుకుతినే అల్పసంఖ్యాకులైన అజీర్తి ప్రభావులున్నారు. వీళ్ళకు రోగాలొస్తే నీళ్లూ (అఫ్‌కోర్స్ ఎర్రనీళ్లే!) మందులూ ఇచ్చేటందుకు ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వుంది. అది జనరల్ హాస్పిటల్ లా పెద్దభవంతిలో వుంది. అందులో మందులమ్ముకోడాన్కి మంచిమంచి డాక్టర్లున్నారు. వాళ్ళమ్మే మందులు కొనుక్కోడానికి అనతి దూరంలోనే పెద్దపట్నం వుంది రాకపోకలకి రైలుబళ్లున్నాయి. అవి ఆగటానికి ఆ వూళ్లో స్టేషన్‌కూడా వుంది. అక్కడ అడుక్కోడానికి భారత దేశపు ముద్దుబిడ్డలు కోకొల్లలు.

ఆ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పురుళ్లు పోయడం ఎప్పుడూ వినలేదు. పురుళ్ళు రాకుండ చేసేందుకు మాత్రం పెద్ద విభాగంవుంది. వాటిగోడల నిండా ఎఱ్ఱత్రికోణపు ముద్రాంకితాలూ, ఇద్దరి పిల్లల తల్లిదండ్రుల పోస్టర్లు వున్నాయి

అక్కడ కుటుంబ నియంత్రణ వారోత్సవాలు జరుగుతున్నాయి. పిల్లలు పుట్టినందుకు ప్రజలూ (ధనికులు మాత్రమే) పుట్టకుండ చేస్తున్నందుకు ప్రభుత్వమూ ఉత్సవాలు చేసుకొనటం పరిపాటి అయింది. అందుకే ప్రజలసొమ్ముతో ప్రభలతీర్థంలా వెలుగుతోంది ఆ వూరు.

ఆ భవనం నేత్రపర్వంగా రంగురంగుల కాంతుల్లో రంగరించుకుంది. డాబా అంచులమీద రంగురంగుల విద్యుద్దీపాలు పరుగులెడుతున్నాయి. అవి దివినుంచిరాలిన దిక్కులేని చుక్కల్లా వున్నాయి. ద్వారం దగ్గర పెద్దస్వస్తిక్ చక్రం తిరుగుతోంది. దానిక్రింద ఆపరేషన్ అంటే అదరిపోతున్న అర్భకుడి హృదయ స్పందనలా ఎఱ్ఱత్రికోణం వెలుగుతూ ఆరుతూవుంది. పుట్టవచ్చిన పిల్లలు పుట్టరుగనుక, వాళ్లపుట్టిన రోజు సామూహికంగా చేసుకుంటున్నట్లుంది ఆ వాతావరణం.

లోపల డాక్టర్లు హడావుడిగా తిరుగుతున్నారు. వాళ్ల గుండెలు 'లక్ష్యాలు-సాధనలు, లక్ష్యాలు-సాధనలు' అని కొట్టుకుంటున్నాయి.

"మంత్రిగారి స్వంతవూరు. కనీసం ఆరువేలయినా టార్గెట్ కావాలిట. లేకుంటేవారికి తీరని అవమానం అంటున్నారు" పెద్ద డాక్టరు ప్రకటన.

ఉగాది కథల పోటీలో మొదటి బహుమతి పొందిన కథ

"అవును. ఇంకా రెండువంతలయినా కాలేదు" వ్రేలి ముద్రల వోచర్లు తిరగేస్తూ గుమస్తా సమాధానం.

టార్గెట్స్! ఎచ్చీవ్‌మెంట్స్!! టార్గెట్స్! ఎచ్చీవ్‌మెంట్స్!!

"వెళ్ళండి ఊరిమీదకి..." శివమెత్తినట్టు అరిచాడు డాక్టర్.

డాక్టర్స్, బ్రోకర్స్, ప్రమోటర్స్-కదిలిందొక మంద.

ముక్కోణపు రాజముద్రికలున్న వేన్లు (Vans) పరుగులెట్టాయి.

హిరోషిమా మీద అణు బాంబుపడినట్లు దుమ్ము గగనాన్నంటింది.

* * *

వేళగాని వేళకు వచ్చినట్లు రైట్ టైమ్‌కు వచ్చింది రైలు.

ప్రయాణీకులు పల్చగా వస్తున్నారు బయటికి.

బిచ్చగాళ్లు మాత్రం బిజీగా తిరుగుతున్నారు.

"ఆకాశ వోణీ వోర్తలుచదువుద్ది యెంకటేసు-అంధ్రలో పోరిగాళ్ళ నమ్మె. రైలోళ్ళకి బయమేసి రైట్టయిమ్కు వచ్చెను- దొరాధరమం."

"బెజవాడలో సోడాలయిద్దం. తాగనాకి సోడా దొరక్క గడుంబకి గిరాకీ-అమ్మా ఒక పైస"

ఒక పైసా అయినా పడిందోలేదో. ప్రయాణీకులు మాత్రం వెళ్ళిపోయారు.

"ఇయవ్వ! ఓ పైసయినా రాలేదియాల" గట్టిగానే అన్నాడు వెంకటేశు.

వేన్ ఒకటి దుమ్ము లేపుకుంటూ వచ్చిఆగింది

వార్తలు చదువుకుంటూ పరుగెత్తాడు వెంకటేశు.

నలుగురు వేన్‌నుంచి దిగారు.

"బాబూ ధరమం"

"ఎన్ని పైసలు గావాల్రా నీకు"

"నరిసిం బాబే ఆడగలేదు. మీరేంటిదొరా దరమానికి సీలింగెడతన్నారు."

హారి నీ... అయితే అయిదు రూపాయలు"

"అమ్మ బాబోయ్! అయి నిజంపైసలేనా జపాను కాయితాలా?"

"నిజం పైసలేరా కారెక్కు"

అతనెక్కలేదు. ఎక్కించ బడ్డాడు.

* * *

ఆఫీస్‌లో చిత్రగుప్తుడి వారసుడు.

"ఇక్కడ వేలిముద్ర వెయ్యి"

"అయ్యోవ్... నెనెయ్య"

"పైసలొద్దా?"

"కావాల"

"అయితే పట్టు వేలు"

"ముద్దమాత్ర వెయ్య"

"ఏం, తెగులా?"

"ఏలుముద్దరలేసి మాఅయ్య నన్ను రోడ్డుమీది కొగ్గేసిండు."

"నువ్వోవళ్లనీ ఒగ్గెయ్యకర్లా."

"నేనెయ్య..."

"నువెయొద్దులే..."

అతనే వేలిముద్ర వేశాడు.

"తీసికెళ్ళండిరా వీణ్ని."

యమకింకరుల్లాంటి నలుగురు తోటీలు వెంకటేశుని ఆపరేషన్ థియేటర్‌కు ఈడ్చుకుపోయారు. అది మయసభో, మాయలోకమో అనిపించింది అతనికి.

దేవతవేషం వేసుకున్న రాక్షసుడిలా నుంచున్నాడు డాక్టర్.

"ఊ బల్లెక్కు."

"బల్లెందుకు దొరా?"

"ఆపరేషన్‌కు."

"పైసలిస్తమని తోలుకొచ్చి ఆపరేషనేంటిదొరా"

"ఆపరేషన్ ముందు, పైసలు తర్వాత."

"నే బీమారోణ్ని గాను."

"ఇది బీమారాపరేషన్‌గాదు. బిడ్డలుపుట్టకుండ"

"నాకు పెళ్ళంలేదు."

అనుమానంగా చూశాడు డాక్టర్.

"ఏంపనిచేస్తావు"

"రేడియం వార్తలు నదువుతా"

"ఏస్టేషన్లో"

"రైలు టేషన్లో"

డాక్టరు నెత్తికొట్టుకున్నాడు.

"ఎవరక్కడ. ఆ ప్రమోటర్ని పిలు"

వచ్చాడు.

"ఏమిటిః బ్రహ్మచారిని అందులోను బెగ్గర్‌ని తెచ్చావు."

"ఉభయ తారకం సార్"

"బెగ్గర్ మహరాజులు బ్రహ్మచారులుగానే వుండిపోరు సార్. వాళ్ళకీ నరాలకి ఆకలైనప్పుడు బేగం సాయిబాలు వుంటారు, పిల్లలు పుడతారు. పుట్టినవాళ్ళు గతి తప్పకుండ వాళ్ళ సామ్రాజ్యానికి వారసులై కూర్చొంటారు. అందుకే ఉభయతారకం సర్. మనకి టార్గెట్స్. వాళ్లకి పైసలు. అసలు నన్నడిగితే మొట్టమొదట బెగ్గర్ పాప్యులేషన్ అరికట్టాలిసర్. అప్పుడే తలసరి ఆదాయంలో లీకేజెస్ నిల్చిపోతాయి" అన్నాడు ప్రమోటర్‌గా బ్రతుకు వెళ్ళబుచ్చుతున్న ది గ్రేట్ ఎకనమిస్ట్.

డాక్టర్‌కి ఆ సాహిత్యం అర్థంకాలేదు. అర్థమైనట్లు కన్పించటానికి ప్రయత్నిస్తున్నాడు.

"కానీయండిసార్" వెళ్ళిపోయాడు.

"ఎత్తండి వీణ్ని బల్లమీదికి"

తోటీలు సాయంపట్టేశారు.

శవంమీదకప్పినట్లు అతనిమీద లినెన్‌కప్పారు.

రెండుసార్లు లేవబోయాడు వెంకటేశు. తల బల్లకేసి నొక్కివట్టారు.

గాజుల గలగలలెరుగని వెంకటేశు 'వాన్' మీద కత్తులు కదంతొక్కాయి.

పురుడు కష్టమైన స్త్రీ నొప్పుల్లో అరిచినట్లు కెవ్వుమన్నాడు.

ఆ తర్వాత ప్రసవానంతర నిట్టూర్పులా నీరసంగా మూలిగాడు.

* * *

రికెట్ పేషెంటులా ఆఫీస్‌గదిలోకి నడిచి వచ్చాడు వెంకటేశు.

రెండురూపాయలు అతని చేతిలో వడ్డాయి.

"అయిదిస్తవన్నారు"

"ముద్దరెయ్యలేదుగామరి"

"యేస్తా"

"ఇప్పుడొద్దులే పో..."

* * *

రాత్రి ఎనిమిది గంటలయింది. కాళ్ళీడ్చుకుంటూ వచ్చి పీరుసాయిబు మాంసంకొట్టుదగ్గర కూలబడ్డాడు వెంకటేశు. గుంటూరు కారంకూరినట్లు మండుతోంది గాయం. కట్టు చేతితో తడుంకొన్నాడు. తడిగా తగిలింది. చూసుకున్నాడు. ఎఱ్ఱ త్రికోణం కంటె మిన్నగా కొడుతోంది నెత్తురు.

గుండునూదుల్తో పొడుస్తున్నట్లుంది'డాక్టరివ్వాళే ఆపరేషను ఖురూర్‌చేసిందా, లేక పీరుసాయేబు మేకల్దొరక్క నన్నే కోసేస్తన్నడా' అనుకున్నాడు.

మూలుగుతూ మూసిన షట్టర్స్ ప్రక్కన ఒరిగాడు. బాధ పెరుగుతున్నది. నడ్డిమీదనుంచి కారెళ్లిన వూరకుక్కలా గిలగిలలాడాడు. తట్టుకోలేక లేచి కూర్చొన్నాడు. ఎదురుగా నర్సింగ్ హోమ్ కన్పించింది.

వెంకటేశుకు అర్హతలేని ఆలోచనొచ్చింది. మెల్లిగా లేచాడు.

అక్కడున్న పేషెంట్లంతా ఆకలెరుగని అదృష్టవంతులే.

క్రింద ఒకమూల ఒరిగి కూర్చొన్నాడు.

పక్షపాతం ఎరుగని మానవాతీతుడిలా అతణ్ని వరుసప్రకారం పిల్చాడు డాక్టర్ "ఏం జబ్బు?" డాక్టర్‌గానే అడిగాడు.

వెంకటేశు పేషెంటులా చెప్పలా. తనపైన హత్యాప్రయత్నం జరిగినట్టు కంప్లెయింట్ చేశాడు.

"ఇది పోలీస్‌స్టేషన్ కాదు. నీబాధేమిటో చెప్పు"

చెప్పాడు.

కట్లువిప్పి చూశాడు డాక్టర్. నెత్తురు స్రవిస్తున్నది. కుట్లుకూడ వేసినట్లు లేదు.

"ఆపరేషన్ సరిగా చేయలేదు. మళ్లాచేసి కుట్లు వెయ్యాలి. లేకుంటే సెప్టిక్ అయి అన్యాయంగా చచ్చిపోతావు."

వెంకటేశు ఏడుపు లంకించుకున్నాడు.

"ఏం పనిచేస్తావు?"

"రైల్టేషన్లో అడుక్కుంటాన్దొరా"

"పైసలెన్నివున్నాయి?"

"రెండు రూపాయిలు దొరా"

"నాఫీజు పాతికరూపాయిలు తెల్సా?"

"గులాపోణ్ని దొరా నచ్చిపోతన్నా" కాళ్ళు పట్టుకున్నాడు.

కాళ్ల వెనక్కి లాక్కుని "ఇది ధర్మానుపత్రి కాదు. పైసలిచ్చేవాళ్ళకే ఇక్కడ వైద్యం వాళ్లెన్ని పైసలిచ్చారు"

"రెండ్రూపాయి లిచ్చిన్రు దొరా"

త్వరగా కట్టుకట్టేశాడు. తలుపుతెరచి 'ధర్మానుపత్రి కెళ్ళు' అని బయటికినెట్టి "యస్... నెక్స్ట్" అన్నాడు.

* * *

అర్థరాత్రి. వీధిలో దీపాలు, పేదవాడి ఆశల్లా వెలుగుతున్నాయి. స్టేషన్లో రైలాగిన చప్పుడయింది. లేచి వెళ్ళటానికి ప్రయత్నించాడు. నరాలు స్వాధీనం తప్పినట్లయింది "అమ్మా" అని కూలబడ్డాడు.

వీధిలో గస్తీ పోలీస్‌దృష్టి అతనిమీద పడింది.

"రేయ్. ఎవడ్రా నువ్వు"

"నేను దొరా... నీ కాంచను" అన్నాడు మూలుగుతూనే.

"బడాచోర్ ఇక్కడెందుకు తొంగున్నావ్?"

"పెయ్యి బాగులేద్దొరా"

"తెల్... దొంగ... లే ఆడనుంచి"

కుక్కని తన్నినట్లు తన్నాడు.

"సచ్చినా దొరా" అని అరిచాడు.

"ఛల్. ఈడనుంచి పోబే..."

"లేలేన్దొరా... ఆపరేసన్జేసిన్రు"

"నీకేం ఆపరేషన్..."

"సర్కారావరేషన్ దొరా"

"అయితే సైసల్ దండిగుంటయే"

దుప్పటి లాగి బట్టలన్నీ వెతికి నంచి బయటికి తీశాడు.

( మిగతా 78 వ పేజీలో )

( 16 వ పేజీ తరువాయి )

"తూత్... రెండురూపాయిలా" జేబులో పెట్టుకున్నాడు.

"ఆకలేస్తున్నది. ఆ పైసలియ్యిదొరా?"

"ఏం దమా కరాబయిందా. జవానిచ్చుకున్న పైసల్ వాపసిమ్మంటవు." ఒక్కతన్నుతో ముందుకు బోర్లపడ్డాడు వెంకటేశు.

కానిస్టేబులు ఇనపడెక్కలు మ్రోగించుకుంటూ నిష్క్రమించాడు.

అలాగే బోర్లపండుకున్నాడు వెంకటేశు.

గాయం కత్తితో కెలికినట్లయింది.

కట్టులోపల ముళ్లపంది వెంట్రుకలు విప్పి గిరగిరా తిరుగుతున్నట్లు అవ్యక్తమైన సలుపు.

మేధస్సు పనిచేయటం మానుకుంది

మైకంవచ్చి కళ్ళు మూసుకున్నాడు.

వాతమో మరేదో... క్రమ్మింది.

దూరంగా ఎక్కడో తీతువు కూసింది.

**READ**

# ANDHRA JANATHA

TELUGU DAILY

Official organ of

**ANDHRA PRADESH CONGRESS COMMITTEE**

Published from the Capital

*Editor* : **Katragadda Rajagopala Rao**

*Best media for*

**READERS AND ADVERTISERS**

For details contact :

**ANDHRA JANATHA**

P. B. No. 222 Phone : 44950

HYDERABAD–500001